ప్రజాశక్తి
శనివారం 22 నవంబర్ 2025
5
విజయనగరం



లేబర్‌కోడ్‌ల నోటిఫైపై నేడు నిరసనలు

సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్‌కోడ్‌లను నోటిఫై చేయడాన్ని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సురేష్, టివి రమణ తీవ్రంగా ఖండించారు. లేబర్‌కోడ్‌లను నోటిఫై చేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం జిల్లా వ్యాప్తంగా నోటిఫై కాపీలను దహనం చేసి నిరసన తెలపాలని కార్మికులకు పిలుపునిచ్చారు. పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకు మాత్రమే బిజెపి ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్లను తెచ్చిందని పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల అనంతరం నోటిఫై చేయడం ద్వారా తన కుటిలత్వాన్ని బయట పెట్టుకుందని తెలిపారు. మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై, లేబర్‌కోడ్ల రద్దుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

కౌలురైతులకు అందని 'సుఖీభవ'

రెండు విడతల్లోనూ మొండిచేయి ● ఆందోళనలో సాగుదారులు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వ్యవసాయ పెట్టుబడి పేరిట ఏటా రూ.20వేల ఆర్థిక సాయంతో రైతులను ఆదుకుంటామని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం ఆచరణలో విఫలమైంది. కేవలం సొంత భూములు ఉన్నవారికి మాత్రమే అందజేసింది. అందులోనూ వందలాది మందికి మొండిచేయి చూపింది. సొంత భూమి లేక ఇతరుల భూమిని సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న వేలాది కుటుంబాల వారికి పూర్తిగా ఎగనామం పెట్టింది. దీంతో, ఆయా కుటుంబాలు తీవ్ర ఆవేదన, ఆందోళనకు గురౌతున్నాయి. రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు ఈనెల 19వ తేదీన రైతులకు విడుదల చేసిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పిఎం కిసాన్ రూ.6వేలతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు మొత్తంగా రూ.20వేలు అందిస్తోంది. మూడు విడతలుగా అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2, 27,000 మంది రైతులకు లబ్ధి చేకూరే విధంగా మొదట విడతలో అన్నదాత సుఖీభవ ద్వారా ఒక రైతుకు రూ.5వేలు చొప్పున ఈ ఏడాది ఆగస్టు 2న పిఎం కిసాన్ ద్వారా ఒక్కో రైతుకు రూ.2వేలు చొప్పున 1,93,000 మంది రైతులకు రూ.38కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్టు చెబుతున్నారు. ఈ ప్రచారం జిల్లాలో పండగ వాతావరణంలో చేశారు. కానీ, కౌలు రైతులకు మాత్రం అటువంటి సాయమేదీ అందలేదు. వాస్తవానికి మన జిల్లాలో దేవాదాయ భూములు, నాలా వారి భూములు, ఇతర ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటూ చాలా మంది జీవనం సాగిస్తున్నారు. పోడు భూములకు పట్టాలు నోచుకోని గిరిజనులూ ఉన్నారు. ఈ లెక్కన జిల్లాలో సుమారు 60వేల మంది లక్ష ఎకరాలకుపైగా కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. వీరిలో దాదాపు 16వేల మంది వరకు సెంటు భూమి కూడా లేనివారు ఉన్నారు. ఈ ఏడాది 13,834 మంది సాగుదారులకు కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చారు. దీన్నిబట్టి వీరంతా సుఖీభవ సాయం కోసం ఎదురు చూస్తున్నారే. కానీ, వీరిలో ఒక్కరికి కూడా గడిచిన రెండు విడతల్లో వర్తింపజేయలేదు. దీంతో, వారంతా తామేం పాపం చేశాం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఇలా కౌలుకు తీసుకున్నవారు పంటలో సగభాగం భూమి యజమానులకు ఇవ్వడం లేదా ఏడాది నిర్ణీత మొత్తాన్ని చెల్లించడం వంటి ఒప్పందాలు మన ప్రాంతంలో ఉన్నాయి. ఇది కాకుండా ఏటా పెరిగిన ఎరువులు, పురుగుల మందులు, కూలిరేట్లు, పెరిగిన డీజిల్ ధరల ఆధారంగా ట్రాక్టర్ అద్దెలు, నెలవారీ పంపుసెట్ల విద్యుత్ బిల్లులు తట్టుకోవడం కౌలుదారులకు తలకుమించిన భారంగా ఉంది. అయినప్పటికీ తల్లిని నమ్ముకుని వ్యవసాయం ఆధారంగానే జీవనం సాగిస్తున్నారు. కౌలు రైతులతో పాటు నాలా వారి భూములు, ఇనాం భూములు ఉన్న రైతులందరికీ తక్షణమే పెట్టుబడి సాయం చెల్లించాలని ఏపి రైతు సంఘం డిమాండ్ చేస్తోంది.



ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాము, వెంకటేష్, నాయకులు

27, 28 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 27, 28 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ 33వ జిల్లా మహాసభ విజయనగరంలోని లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం నినాదంతో ఏర్పడిన ఎస్‌ఎఫ్‌ఐ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, అలుపెరుగని పోరాటాలు చేస్తున్నారు. జిల్లాలో విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు నడుపుతున్న ఏకైక విద్యార్థి సంఘమన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం, విద్యార్థులు సమస్యలు పరిష్కారం కోసం మహాసభల్లో చర్చించి నిర్ణయాలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా 27న గురజాడ కళాభారతి ఆడిటోరియంలో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్య వక్తగా జెఎన్‌యు మాజీ ఎస్‌ఎఫ్‌ఐ నాయకురాలు ఐషి ఘోష్, ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి హాజరవుతారని తెలిపారు. మహాసభలకు మేధావులు, విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ శ్రేయోభిలాషులు సహాయ సహకారాలు అందించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విలేకర్ల సమావేశంలో ఎస్ ఎఫ్ ఐ నాయకులు రవికుమార్, చినబాబు, శిరీష్, సోమేష్,జగదీష్, రమణ పాల్గొన్నారు.

గజపతినగరం : ఈ నెల 27, 28న విజయనగరంలో జరిగే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గౌరీ, ఎస్.సోమేష్ కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.శిరీష, మండల ఉపాధ్యక్షులు కృష్ణ, సహాయ కార్యదర్శి నందిని పాల్గొన్నారు.

24 నుంచి రైతన్న మీకోసం సర్వే

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈనెల 24 నుండి 29 వరకు రైతన్న మీకోసం అనే కార్యక్రమం ద్వారా రైతుల సర్వే జరుగుతుందని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో సుమారు 3.50 లక్షల మంది రైతుల ఇళ్లకు వెళ్లి కల్టివేటర్ యాప్‌లో రైతుకు ఎంత పొలం ఉంది, ఏ పంట వేస్తున్నారు, దిగుబడులు ఎలా వస్తున్నాయి, రైతుకు ఏ విధమైన అవసరం ఉంది తదితర వివరాలను నమోదు చేయాలన్నారు. శుక్రవారం కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయశాఖ అధికారులు ఎంపిడిఒలు, తహశీల్దార్లతో మాట్లాడారు. వెంటనే ప్రతి గ్రామానికి టీమ్ లను నియమించాలని, ఈ టీమ్ లు ఇంటింటికి వెళ్లి జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. ఎంపిడిఒలు, తహశీల్దార్లు, ఏఒలు క్లస్టర్ వారీగా సచివాలయ సిబ్బందిని ప్రతి గ్రామానికి నియమించాలని, ఒక్కొక్కరు రోజుకు కనీసం 30 మందిని నమోదు చేయాలని తెలిపారు.

స్విమ్మింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 22నుంచి 23వరకు సబ్ జూనియర్, జూనియర్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు విశాఖపట్నం బీచ్ రోడ్‌లోని ఆక్వా స్విమ్మింగ్ పూల్‌లో జరుగనున్నాయి. పోటీలకు విజయనగరం నుంచి ఎంపికైన క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన.అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు , స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.ఆదిలింగం, కోచ్‌లు ఎల్ శ్రీను, కె.శ్రీనివాస్ అభినందించారు.

మరణించినా జీవించాడు

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవదానం



ప్రజాశక్తి- కంటోన్మెంట్

మరణించినా ఆ వ్యక్తి జీవించాడు. బ్రెయిన్‌డెడ్ అయిన ఆ వ్యక్తి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసి పలువురికి జీవం పోసి ఆదర్శంగా నిలిచారు. విజయనగరంలోని కెఎల్ పురానికి చెందిన శిగడం ఆదినారాయణ (54) ఈ నెల 19న హై బీపీ రావడంతో ఇంటి వద్ద కుప్పకూలి పోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే నగరంలోని తిరుమల-మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సకు శరీరం సహకరించకపోగా, కోమాలోకి వెళ్లాడు. బ్రెయిన్‌డెడ్ అయినట్లు గురువారం రాత్రి కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపారు. ఆ కుటుంబ సభ్యులు అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో శుక్రవారం ఉదయం తిరుమల-మెడికవర్ ఆసుపత్రి ఇన్‌ఛార్జి మల్లికార్జున్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.తిరుమలప్రసాద్ ఆధ్వర్యంలో వైద్యులు న్యూరో ఫిజీషియన్ రెడ్డి సుధీర్ నాయుడు, న్యూరో సర్జన్ హేమస్వరూప్, ఐసియు ఇంచార్జ్ అంబల్ల జగదీష్, మత్తు వైద్యునిపుణులు దుర్గాప్రసాద్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కష్టపడి అవయవాలను తీశారు. మృతుడు ఆదినారాయణకు చెందిన రెండు నేత్రాలు ,రెండు కిడ్నీలను విశాఖపట్నం కిమ్స్‌కు తరలించారు. ఆదినారాయణకు తిరుమల నర్సింగ్ హోమ్ విద్యార్థులు, ఆస్పత్రి వైద్యులు ఘనంగా నివాళులర్పించారు. అవయవాలు దానం చేసినందుకు ముందు వచ్చిన కుటుంబ సభ్యులకు ఆసుపత్రి వైద్యులు ప్రజలు అభినందనలు తెలిపారు.



అవయవదానం సర్టిఫికెట్లను కుటుంబ సభ్యులకు అందజేస్తున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

విజయనగరం టౌన్ : జిల్లా ఖోఖో అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కమలనాభరావు, గోపాల్ ఎన్నికయ్యారు. శుక్రవారం నగరంలో ఓ ప్రైవేటు హోటల్లో జిల్లా ఖో ఖో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. చైర్‌పర్సన్‌గా పెనుమజ్జి విజయలక్ష్మి, అధ్యక్షులుగా ఎఎంఎన్ కమలనాభరావు, కార్యదర్శిగా కె.గోపాలరావు, కోశాధికారిగా ఎస్‌హెచ్. ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి. మల్లిఖార్జునరావు, గౌరవ అధ్యక్షులుగా పి.చిన్నం నాయుడు, బి.రామారావు ఎన్నికయ్యారు. పరిశీలకులుగా సిహెచ్ నాగభూషణం, ఎ.శ్రీనివాసరావు, సిహెచ్.వేణుగోపాలరావు, ఇఒగా ఎ.మోహనరావు వ్యవహరించారు.

10 మంది జెఎన్‌టియు విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు

విజయనగరం టౌన్ : జెఎన్‌టియుజివి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 10 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికై ఉద్యోగాలు సాధించారు. ఈనెల 14న జయరాజ్ స్టీల్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 10 మంది మెటలార్జికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ నుండి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ వి. వెంకట సుబ్బారావు విద్యార్థులను అభినందించారు.

అభివృద్ధి పేరిట కొండలు ధ్వంసం

ప్రజాశక్తి-భోగాపురం

అభివృద్ధి పేరుతో భూ దోపిడీకి పాల్పడుతున్నారని మండల ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ భూములే కాక రైతుల పంట పొలాలనూ వదలడం లేదని వాపోతున్నారు. ఎటునుంచి ఏ అధికారి భూముల వద్దకు వస్తారోనని భయ పడుతున్నారు. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో విఎంఆర్‌డిఎ అధికారులు సర్వే పేరిట సంచరించారు. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో వారు వెనుదిరిగారు. భూముల వద్దకు రానప్పటికీ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాల విఆర్‌ఒల సహకారంతో భూరికార్డులను పరిశీలిస్తున్నట్లు ప్రాథమిక సమాచారం. మరోపక్క శుక్రవారం చెరుకుపల్లి పరిధిలోని సర్వే నంబర్ 1లో కొండ భూములను విఎంఆర్‌డిఎ అధికారులు, సర్వే ఏజెన్సీ సిబ్బందితో వచ్చి రహస్యంగా సర్వే చేస్తున్నారు. ఆ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకుని సర్వే సిబ్బందిని అడ్డుకున్నారు. గ్రామస్తులకు తెలియకుండా, చివరికి విఆర్‌ఒ కూడా లేకుండా తమ గ్రామంలో సర్వే ఎలా చేస్తారంటూ నిలదీశారు. తమకేమీ తెలియదని విఎంఆర్‌డిఎ అధికారులు పురమాయిస్తేనే.. విజయనగరం జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్ భగవాన్ దాస్ ఆధ్వర్యంలో వచ్చి సర్వే చేస్తున్నామని వారు తెలిపారు. ఇదే విషయమై మండల సర్వేయర్ శివాజీని వివరణ కోరగా విఎంఆర్‌డిఎ అధికారులు ఆర్‌డిఒను సంప్రదించగా, వారు జిల్లా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను మండలానికి పంపించి సర్వే చేస్తున్నారని తెలిపారు. ఈ కొండపై ఇప్పటికే వివాదం ఉంది. మాజీ సైనిక ఉద్యోగులకు కేటాయించారంటూ కొండను చదును చేయడానికి కొందరు ప్రయత్నించగా గ్రామస్తుల అడ్డుకున్నారు. దీంతో ఆ ప్రయత్నానికి కొంత విరామం ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొండవైపు ఎవరూ రాలేదు. మరలా ఆ కొండను కబ్జా చేసేందుకు ఇప్పుడు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మొత్తం 53.95 ఎకరాల కొండ భూమి ఉండగా కొంతభాగంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మిగతా భూమి ఏదో రకంగా లాగేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. చెరుకుపల్లి వాసులు మాత్రం ఆ ప్రయత్నాలను అడ్డుకుంటున్నారు.



కొండ సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు

పక్షి ప్రమాద రహితంగా ఎయిర్‌పోర్టు

కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి-కలెక్టరేట్

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పక్షి ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. మొట్టమొదటి ఏరోడ్రోమ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ప్రకృతికి అనుకూలంగా సురక్షితమైన, సుస్థిరమైన విమానాశ్రయ వాతావరణాన్ని కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అంతర్జాతీయ విమానయాన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా, విమానాశ్రయం చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో పక్షి ప్రమాదం లేని ప్రాంతాన్ని సృష్టించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దష్టి పెట్టాలని ఆదేశించారు. విమానాశ్రయానికి సమీపంలో పశువులు, వన్యప్రాణుల ప్రమాద నిర్వహణ, చెత్త, వ్యర్థాల తొలగింపు, వాటి నియంత్రణకు పటిష్టమైన చర్యలను అమలు చేయాలని ఆదేశించారు. దీనికోసం స్థానిక పరిపాలన యంత్రాంగానికి, విమానాశ్రయ నిర్వహణ సంస్థకు మధ్య పరస్పర సహకారం ఉండాలన్నారు. ఈ మేరకు విమానాశ్రయం సమీపంలోని ఇఒపిఆర్‌డిలకు, ఎంపిడిఒలకు, పంచాయతీ కార్యదర్శులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని డిపిఒకు సూచించారు. పర్యావరణ భద్రత, నిర్వహణలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఒక మోడల్‌గా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో భోగాపురం విమానాశ్రయం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ లక్కీ వర్మ భాస్కర్, ప్రాజెక్ట్ హెడ్ బిహెచ్ఎ రామరాజు, పర్యావరణ నిపుణులు ఏజెడి కార్తీక్, వన్యప్రాణి రక్షణ నిపుణులు బిభూ పాండే, డిఎంహెచ్ఒ జీవన రాణి, ఆర్‌డిఒ డి.కీర్తి, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఇంజినీర్ సరిత, డిపిఒ మల్లిఖార్జునరావు, డిఎఫ్ఒ రామ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

అభివృద్ధి పనులకు శ్రీకారం

గ్రామాలాభివృద్ధికి సహకారం అందిస్తా : విశాఖ ఎమ్‌పి భరత్

ప్రజాశక్తి-వేపాడ, శృంగవరపుకోట

శృంగవరపుకోట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు విశాఖపట్నం ఎమ్‌పి శ్రీభరత్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ శ్రీకారం చుట్టారు. శుక్రవారం శృంగవరపుకోట, వేపాడ, లక్కవరపుకోట మండలాల్లో పర్యటించి, సుమారు రూ.6 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. లక్కవరపుకోట మండలం రంగారాయపురంలో రూ.7.50 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. శృంగవరపుకోట మండలం శివరామరాజుపేటలో రూ.90 లక్షలతో బిటి రోడ్డుకు, ఎస్.కోటలో రూ.53 లక్షలతో ఎంఆర్‌సి, రూ.3 కోట్లతో ఐసిడిఎస్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉసిరి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. వేపాడ మండలం ముకుందపురంలో రూ.30 లక్షలతో నిర్మించిన కల్వర్ట్ బ్రిడ్జిని ప్రారంభించారు. కరకవలసలో రూ.32 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎస్.కోట పట్టణంలో ప్రభుత్వ కాలేజీ మైదానాన్ని పూర్వస్థితికి తీసుకొచ్చేందుకు నిధులు మంజూరు చేయించాలని స్థానికులు ఎమ్‌పికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్‌పి శ్రీభరత్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తానని హామీనిచ్చారు. డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ గ్రూపు రాజకీయాలు విడిచిపెట్టి కలిసికట్టుగా ఉంటే తప్ప గ్రామాలు అభివృద్ధి చెందవని, ఈ విషయాన్ని కూటమి నాయకులు సరిదిద్దుకుని ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకటరత్నాజీ, కార్పొరేషన్ల డైరెక్టర్లు మాకిరెడ్డి శ్రీలక్ష్మి, నానిగిరి రామనాజీ, గనివాడ బంగారునాయుడు, టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, దోకుల అచ్చెంనాయుడు, కరెడ్ల ఈశ్వరరావు, వేపాడ మండల ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి, పిఎసిఎస్ చైర్మన్లు జి.ఎస్.నాయుడు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, ఐటిడిపి మండల అధ్యక్షులు సేనాపతి గణేష్, వేపాడ ఎంపిపి డి.సత్యవంతుడు, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, పిఆర్ జెఇ ఆలీ, తదితరులు పాల్గొన్నారు.



వేపాడ మండలం కరకవలసలో పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్‌పి భరత్

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలే లక్ష్యం : ఆర్‌జెడి

ప్రజాశక్తి - గజపతినగరం

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్‌జెడి విజయభాస్కర్ సూచించారు. నియోజకవర్గంలో పదో తరగతి ఉపాధ్యాయులతో శుక్రవారం బోడసింగిపేట పరిధిలో ఉన్న ఆర్‌సిఎం స్కూల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఫలితాలను విశ్లేషించి, ఈ ఏడాది ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు తీసుకోవాల్సిన వ్యూహాలపై చర్చించారు. డిప్యూటీ డిఇఒ కె.మోహన్ రావు, ఎంఇఒలు ఎస్.విమలమ్మ, బి.సాయి చక్రధర్, అల్లు వెంకటరమణ పాల్గొన్నారు.

నెల్లిమర్ల కమిషనర్‌గా జనార్దనరావు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్‌గా ఎస్.జనార్ధనరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి కమిషనర్ టి.జయరాం, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. జనార్ధనరావు విశాఖపట్నం నగరపాలక సంస్థలో శానిటరీ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ జనార్ధనరావు

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్, రామభద్రపురం

ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్ అధికారులను ఆదేశించారు. రైతులు ఇబ్బంది పడకుండా ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఆయన శుక్రవారం బొబ్బిలి, రామభద్రపురం మండలాల్లో పర్యటించారు. బొబ్బిలి మండలం మెట్టవలస, రామభద్రపురం మండలం రొంపల్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, సజావుగా పూర్తిచేయాలని ఆదేశించారు. 159 మిల్లర్ల బ్యాంకు గ్యారెంటీలకు గాను ఇప్పటికే 130 గ్యారెంటీలు వచ్చాయన్నారు. ఈ పర్యటనలో తహశీల్దార్లు ఎం.శ్రీను, రఫీజాన్, డిటి సాయికృష్ణ, మండల వ్యవసాయాధికారులు ఎం.శ్యామసుందర్, ఎ.శివ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పిపిసి వద్ద అధికారులతో మాట్లాడుతున్న జెసి మాధవన్

డిటి జగన్నాథరావుకు తీవ్ర అస్వస్థత

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్ల మండల ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ వివిఆర్ జగన్నాథరావు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో విధులకు హాజరైన ఆయన కొద్దిసేపటికే తలనొప్పితో కుర్చీలోనే కుప్పకూలిపోయారు. తహశీల్దార్ కె.శ్రీకాంత్ వెంటనే స్పందించి సిబ్బంది సహకారంతో తన కారులోనే మిమ్స్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. మెదడులో నరాలు చిట్లినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు విశాఖపట్నంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్ మిమ్స్‌కి చేరుకుని వైద్యులతో, జగన్నాథరావు కుటుంబీకులతో మాట్లాడారు.

మాత, శిశు మరణాల పట్ల కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి -కంటోన్మెంట్

జిల్లాలో మాతా శిశు మరణాలు సంభవించడం పట్ల వైద్యారోగ్యశాఖపై జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరణాలు చోటుచేసుకుంటుంటే క్షేత్రస్థాయిలోని ప్రభుత్వ యంత్రాంగం ఏంచేస్తోందని ప్రశ్నించారు. పేద ప్రజల ప్రాణాల రక్షణకోసమే ఈ యంత్రాంగం ఉందని, సిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. డిస్ట్రిక్ట్ మెటర్నల్, చైల్డ్ డెత్ సర్వైలెన్స్ రెస్పాన్స్ కమిటీ (ఎంపిసిడిఎస్‌ఆర్) సమీక్షా సమావేశం కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగింది. ఇటీవల సంభవించిన నాలుగు మాతృ మరణాలు, మూడు శిశు మరణాలపై కలెక్టర్ సమీక్షించారు. మరణాలు సంభవించిన కుటుంబ సభ్యులను, వారి యోగ క్షేమాలపై విచారించారు. వైద్యాధికారులు, చికిత్సనందించిన వైద్యులను ప్రశ్నించి కారణాలను తెలుసుకున్నారు. కొన్ని మరణాల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోందని అన్నారు. ఆయా అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని మరణాలపై సమగ్ర నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ఆశ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, గర్భిణులు, బాలికలు, మహిళల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆదేశించారు. అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్త, మహిళా పోలీసులతో కమిటీలు వేయాలని సూచించారు. సమావేశంలో డిఎంఅండ్‌హెచ్ఒ జీవనరాణి, డిసిహెచ్‌ఎస్ పద్మశ్రీరాణి, ఘోషాసుపత్రి గైనకాలజి విభాగాధిపతి శుభశ్రీ, డిఐఒ అచ్చుతకుమారి, ఐసిడిఎస్ పీడీ విమలారాణి, డిటిఒ డాక్టర్ కె.రాణి, పలువురు వైద్యులు, ఎఎన్‌ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పివిఆర్ ఆస్పత్రిలో డిఎంహెచ్ఒ తనిఖీలు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి నగరంలోని పివిఆర్ ఆస్పత్రిని, ఆల్ఫా స్కాన్ డయోగ్నొస్టిక్ సెంటర్‌ను ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ నిర్వహించారు. పివిఆర్ ఆస్పత్రిలో రికార్డులు, రిజిస్టర్ లు తనిఖీ చేసారు. స్కాన్ సెంటర్ ఆన్ లైన్, ఆఫ్ లైన్ లో ఉన్న రిపోర్టులను, టారిఫ్ బోర్డును కూడా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలనుసారం ఆస్పత్రిని నిర్వహించకపోతే చర్యలు తీసుకుంటామని పివిఆర్ ఆస్పత్రి వైద్యులను హెచ్చరించారు.

కార్యక్రమంలో డెమో వి. చిన్నతల్లి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం.చాముండేశ్వరి మానిటరింగ్ కన్సల్టెంట్ ఎ. పవన్ ఆశిష్ పాల్గొన్నారు.

బాలింత మృతిపై దర్యాప్తు

ప్రజాశక్తి -బొబ్బిలి

పట్టణంలోని మూడు నెలల క్రితం అనారోగ్యంతో బాలింత కె.పావని మృతిపై శుక్రవారం డిసిహెచ్‌ఎస్ పద్మశ్రీ, ఐసిడిఎస్ పీడీ విమలరాణి దర్యాప్తు చేశారు. ఇందిరమ్మ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లో రికార్డులను పరిశీలించారు. బాలింత అనారోగ్యంతో మరణిస్తే ఏమి చేశారని వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. గర్భిణులకు హిమోగ్లోబిన్ టెస్ట్ ఎప్పటికప్పుడు చేయాలని ఆదేశించారు.

గర్భిణుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

గర్భిణుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఐసిడిఎస్ పీడీ విమలరాణి అన్నారు. పట్టణంలోని ఆగురువీధి అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం డిసిహెచ్‌ఎస్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గర్భం దాల్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకుని పోషకాహారం తీసుకోవాలన్నారు. అంగన్వాడీలు విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సిడిపిఒ విజయలక్ష్మి, సూపర్ వైజర్లు ఉన్నారు.



అర్బన్ హెల్త్ సెంటర్లో దర్యాప్తు చేస్తున్న అధికారులు

ప్రజల సహకారంతోనే నేరాల అదుపు

డిఎస్‌పి రాఘవులు

ప్రజాశక్తి చీపురుపల్లి

ప్రజల సహకారంతోనే సమాజంలో నేరాలను అదుపు చేయవచ్చని డిఎస్‌పి ఎస్.రాఘవులు అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బంగారం వ్యాపారులకు డిఎస్‌పి సూచనలు చేశారు. బంగారు నగల దుకాణాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. షాపులలో పనిచేసే ఉద్యోగుల ధ్రువీకరణ కూడా స్పష్టంగా ఉండాలన్నారు. పాత నగలు కొనుగోలు సమయంలో అమ్మకపుదారుడి పూర్తి వివరాలను తీసుకొని భద్రపరచాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ జి.శంకర్రావు, ఎస్ఐ ఎల్.దామోదర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని కోరాడవీధి, రావువారివీధి సచివాలయాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురమిత్ర అప్లికేషన్ ఇన్‌స్టలేషన్ స్టేటస్, కొళాయి పన్నులు వసూళ్లు, వాట్సాప్ గవర్నెన్స్ వంటి అంశాలపై సమగ్రంగా ప్రజలకు తెలియజేయాలని సెక్రటరీలను ఆదేశించారు సిబ్బంది అంతా సమయపాలన పాటించాలన్నారు.

విజయనగరం టౌన్ : నగరంలోని 44,45 వ నెంబరు సచివాలయాలను కమిషనర్ పల్లి నల్లనయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. హాజరు పట్టీ తదితర రికార్డులను గమనించారు. సకాలంలో కార్యదర్శులు విధులకు హాజరవుతున్నారా లేదా అన్నది అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల ఉదాసీనంగా ఉన్న వారిని మందలించారు. ఇటువంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని చెప్పారు.

నెల్లిమర్ల : మండలంలో జరజాపుపేట 1, 2, చంద్రంపేట, కొండవెలగాడ సచివాలయాలను మండల ప్రత్యేకాధికారి జి.మురళీమోహన్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరు, రికార్డులు తనిఖీ చేశారు.

24న సమగ్రశిక్ష ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు సమగ్రశిక్ష ఉద్యోగులు తెలిపారు. శుక్రవారం ఎంఇఒలకు వినతిపత్రం అందించారు. ఏడేళ్లుగా వేతనాలు పెంచడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంఇఒ కార్యాలయ సిబ్బంది రామకృష్ణ, భారతి, ప్రశాంతి, గోవిందమ్మ, సిఆర్‌పిటిలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలకసంస్థలో గత కొన్నేళ్లుగా అనేకమంది ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు మరణించారని, ఆయా కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నగర పాలక సంస్థ కు చెందిన ట్రాక్టర్ల షెడ్ వద్ద కార్మికులు ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కమిషనర్ వచ్చి సమాధానం చెప్పేవరకు వాహనాలను వదిలేది లేదని అన్నారు. స్పందించిన కమిషనర్ చనిపోయిన కార్మిక కుటుంబాలకు న్యాయం చేస్తామని ప్రకటించడంతో కార్మికులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రంగరాజు, కామేష్ కార్మికులు పాల్గొన్నారు.

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వైసిపి కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ధవళ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మొయిద నారాయణపట్నం గ్రామంలో ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు వైద్యవిద్యను దూరం చేయొద్దని కోరారు. కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు పత్తి గిడి శ్రీను, సూరినాయుడు, చనుమల్ల చిరంజీవి, పి.సంతోష్ పాల్గొన్నారు.

కార్మికులకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జ్యూట్ కార్మికులకు 2018 నుండి 2022 వరకు ఉన్న పిఎఫ్ బకాయిలను యాజమాన్యం వెంటనే చెల్లించాలని జ్యూట్‌మిల్ శ్రామిక సంఘం అధ్యక్షులు చిక్కాల వెంకట గోవిందరావు డిమాండ్ చేశారు. కార్మికులకు సంబంధించి పది సమస్యలపై వినతిపత్రాన్ని శుక్రవారం యాజమాన్య ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి బేతా అప్పారావు, ప్రతినిధులు జి.ప్రసాద్, రెడ్డి సన్యాసినాయుడు, సముద్రపు అప్పారావు, పి.గోవింద్, బి.రామ్‌నాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ విజయనగరం జివి విశ్వవిద్యాలయంలోని డాక్టర్ వైఎస్ఆర్ సెంటర్ లైబ్రరీ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. విశాఖపట్నం హిమాంసు బుక్ డిపో సంయుక్తంగా ఈ ప్రదర్శనను నిర్వహించింది. ఈ ప్రదర్శనలో దాదాపు 2500 పుస్తకాలు ప్రదర్శించారు. ప్రదర్శనను ప్రారంభించిన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వి. సుబ్బారావు మాట్లాడుతూ, ఇలాంటి ప్రదర్శన ద్వారా పుస్తక సంస్కృతిని పెంపొందించవచ్చని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, ఆఫీసర్ ఇన్‌చార్జ్ లైబ్రరీ డాక్టర్ డిడిడివి.శివరామ్ రోలంగి, వివిధ విభాగాల అధిపతులు, డాక్టర్ పద్మజ, డాక్టర్ వి.ఎస్.వకుల, అసిస్టెంట్ లైబ్రేరియన్ జి.సన్యాసప్పడు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు శక్తి యాప్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మహిళల రక్షణకు శక్తి యాప్ దోహద పడుతుందని మహిళా పోలీసుస్టేషన్ సిఐ ఇ.నర్సింహమూర్తి అన్నారు. శుక్రవారం ఎస్ఎస్ఎస్ఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులకు శక్తి యాప్, ఈవ్ టీజింగ్, డిజిటల్ అరెస్టు, రహదారి భద్రతా నియమాలు, గంజాయి, సైబర్ నేరాలపై సిఐతో పాటు ఎస్ఐ శిరీష అవగాహన కల్పించారు. విద్యార్థినులకు (ఎస్ఒఎస్) మొబైల్ యాప్ ఏ విధంగా డౌన్లోడ్ చేయాలో వివరించారు. మహిళల మొబైల్ ఫోనులో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందని, ఒక కుటుంబ సభ్యుడు మీకు తోడు ఉన్న ట్లేనన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ లోని ఎస్ఒఎస్. బటను ప్రెస్ చేస్త క్షణాల్లో పోలీసు బృందం మీరున్న ప్రాంతానికి చేరుకొని, రక్షణగా నిలుస్తారన్నారు.


పిల్లలంతా దృఢంగా ఉండాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఆరోగ్యశాఖ సహకారంతో సఖి ప్రాజెక్టులో భాగంగా బాలలతో ముఖాముఖి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సిడిపిఒ జి.ప్రసన్న మాట్లాడుతూ జిల్లాలో యూనిసెఫ్ సహకారంతో నేచర్ స్వచ్ఛంద సేవాసంస్థ సఖి ప్రోగ్రాం నిర్వహిస్తుందని ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. సిడిపిఒ భారతి మాట్లాడుతూ పిల్లలందరూ ఆరోగ్యంగా ఉండి డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయాలన్నారు. సిడిపిఒ ఆరుద్ర మాట్లాడుతూ చాలామంది పిల్లలు అవగాహన లేక లైంగిక వేధింపులకు గురవుతున్నారని, సేఫ్ టచ్ -అన్ సేఫ్ టచ్ పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నేచర్ యూనిసెఫ్ సఖి ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.అనిష్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన విజయనగరాన్ని నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒలు, సిబ్బంది రజిని, నేచర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.అనీష్, చైతన్య, రామకష్ణ, దుర్గ, శంకర్ నాయక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు

మాక్ అసెంబ్లీకి మోడల్ స్కూల్ విద్యార్థి

భోగాపురం : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న అమరావతిలో నిర్వహిస్తున్న విద్యార్థి మాక్ అసెంబ్లీలో పాల్గొనేందుకు భోగాపురం మోడల్ స్కూల్ విద్యార్థిని గారి వర్షితకు అవకాశం లభించింది. నందిగాం గ్రామానికి చెందిన గారి వర్షిత జిల్లా స్థాయిలో వ్యాసరచన, క్విజ్ పోటీల్లో సత్తాచాటడంతో ఈ అవకాశం లభించినట్లు ప్రిన్సిపల్ పార్వతి తెలిపారు. వర్షితను ఎమ్మెల్యే లోకం నాగమాధవి అభినందించారు.



వర్షితను అభినందిస్తున్న ప్రిన్సిపల్ పార్వతి

భూసారంపై అవగాహన

మెరకముడిదాం : మండలంలో బాడాం గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంలో భాగంగా బీడు భూముల సారవంతానికి నాటాల్సిన విత్తనాలపై రీజనల్ టీం హేమసుందర్, మెర్సీ, స్వామి నాయుడు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రధాన పంట మినుముల్లో మూడు వరసలకు 18 రకాల విత్తనాలు నాటడంతో భూమి సారవంతం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంటి వెంకటలక్ష్మి, యూనిట్ ఇన్‌ఛార్జి కళావతి, ఐసిఆర్‌పి ఎస్.పరమేష్, వెంకటేష్, సంతోష్, నరసింహమూర్తి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

గురజాడ విద్యార్థులకు బహుమతులు

విజయనగరం టౌన్ : గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గురజాడ పాఠశాల విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. మొత్తం జిల్లా స్థాయిలో 20 బహుమతులు పొంది ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్. కృష్ణాజీ , పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, హెచ్ఎం పూడిశేఖర్, కల్చరల్ ఈవెంట్స్ ఇంఛార్జి బి.పుష్పలత అభినందించారు.

రూ.10 వేలు వేతనం చెల్లించాలి

గ్రీన్ అంబాసిడర్ల విన్నపాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రీన్ అంబాసిడర్లకు నెలకు కనీసం పదివేల రూపాయలు వేతనం చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒ గంటా వెంకటరావుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.జగన్మోహన్ రావు మాట్లాడుతూ జీవో నెంబర్ 680 ప్రకారం గ్రీన్ అంబాసిడర్లకు కనీస వేతనం రూ.10వేలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈ ప్రభుత్వమైనా ఆ జీవో ప్రకారం తక్షణమే చెల్లించాలన్నారు. కార్మికుల జీతాలను పంచాయతీలకు బదిలాయించడంతో ఆదాయం లేని పంచాయతీలలో నెలల తరబడి జీతాలు రావడం లేదని, పంచాయతీలతో సంబంధం లేకుండా నేరుగా ప్రభుత్వమే ప్రతినెలా 10వ తేదీ లోగా జీతం చెల్లించాలన్నారు. మరణించిన, రిటైర్ అయిన వారి బిడ్డలకు ఉద్యోగాలు, మట్టి ఖర్చులు రూ.15వేలు, ఎక్స్‌గ్రేషియో రూ.5లక్షలు చెల్లించాలన్నారు. ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో గ్రీన్ అంబాసిడర్స్ యూనియన్ నాయకులు తాతారావు, రాము, ఈశ్వరరావు, నర్సింగు సత్యం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





విజయనగరం, వేపాడలో ఎంపిడిఒలకు వినతులు అందజేస్తున్న సిఐటియు నాయకులు, గ్రీన్ అంబాసిడర్లు


వేపాడ : పారిశుధ్య కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యాన ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణకు వినతి అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు మద్దిల రమణ, గాడు అప్పారావు, జి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

జామి : గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్ ముత్యాలు ఆధ్వర్యాన ఎంపిడిఒ నీలం అప్పలనాయుడుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

రాజాం : వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావుకు శుక్రవారం వినతి అందించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల సంఘం నాయకులు నాగిరెడ్డి శివ, ఎం.నాగమణి, భారతి, చిన్నారావు, దుర్గ, శంకర్రావు, దాలయ్య పాల్గొన్నారు.

మెంటాడ : మండలంలో గ్రీన్ అంబాసిడర్ల బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు రాకోటి రాములు, గ్రీన్ అంబాసిడర్ల సంఘం మండల అధ్యక్షుడు అలమండ సన్యాసిరావు ఆధ్వర్యాన ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సుదర్శన్‌రావుకు వినతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.గురువులు, వడ్డి గౌరిబాబు, బొట్ట శ్రీను, జి.సత్యం, బి.రాము, ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.





చీపురుపల్లి, రాజాంలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యేలు కళావెంకటరావు, మురళీమోహన్

అర్జీలను బుట్టదాఖలు చేస్తే ఊరుకోం

ఎమ్మెల్యే కళావెంకటరావు

ప్రజాశక్తి చీపురుపల్లి

ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వస్తున్న వినతులను బుట్ట దాఖలు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు.. అధికారులను హెచ్చరించారు. శుక్రవారం చీపురుపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ ఏర్పాటుచేసి, అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో వస్తున్న అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అలా కాకుండా వచ్చిన అర్జీలపై ఏ అధికారైనా నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

- మెరకముడిదాం మండలం కొర్లాం పంచాయతీ కొత్తకర్ర గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు ఎమ్మెల్యే కళావెంకటరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు సమక్షంలో వైసిపిని వీడి, టిడిపిలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో బూర్లె రాము నాయుడు, బూర్లె రవి ఉన్నారు.

రాజాం : రాజాంలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ప్రజాదర్బార్ నిర్వహించి, వినతులు స్వీకరించారు. సుమారు 90కి పైగా వినతులు వచ్చాయి. గతంలో వచ్చిన వినతులను 90 శాతం వరకు పరిష్కరించామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ -1 కోఆర్డినేటర్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, మాజీ జెడ్‌పిటిసి బొత్స వాసుదేవరావు నాయుడు, కోండ్రు జగదీష్, గురవాన నారాయణరావు, సుమల వెంకట మన్మథరావు, బవిరి శ్రీనుబాబు, దూబ ధర్మారావు, దుప్పల పూడి శ్రీను, జనసేన నాయకులు యుపి రాజు, రమేష్, గెడ్డపు నీలకంఠం, రాజాం మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రావు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-గంట్యాడ

గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రభుత్వం దృష్టిపెట్టిందని ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి అన్నారు. పారిశుధ్యంపై నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పారిశుధ్యంపై నిత్యం ఉన్నతాధికారులు ఆరా తీయనున్నట్లు చెప్పారు. గ్రీన్‌అంబాసిడర్ల పెండింగ్ జీతాల సమస్యను 15 రోజుల్లో పరిష్కరించడానికి ప్రయత్నిస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ నానిబాబు పాల్గొన్నారు

వేపాడ : ఎంపిడిఒ కార్యాలయంలో మూడు రోజులుగా పచ్చదనం- పరిశుభ్రతపై నిర్వహించిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రీన్‌అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. మండలంలోని సుమారు 77 మంది క్లాప్‌మిత్రులు వేపాడలో ప్రతి వీధిని శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, డిప్యూటీ ఎంపిడిఒ రవికుమార్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ జి.రాంబాబు పాల్గొన్నారు.

జామి : జామి పంచాయతీలో క్లాప్ మిత్రలు 91 మందితో పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. ఎంపిడిఒ కార్యాలయంలో తొలుత సిబ్బందికి పారిశుధ్య నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వీరికి జామి గ్రామానికి చెందిన బొలిశెట్టి వెంకటరమణ కుటుంబ సభ్యులు తమ తండ్రి ముత్యాలరావు పేరిట దుప్పట్లు, కంచాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నీలం అప్పలనాయుడు, డిప్యూటీ ఎంపిడిఒ ఉమ పాల్గొన్నారు.

దత్తిరాజేరు : గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి టి.విమలరాణి అన్నారు. చుక్కపేటలో గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ ఏర్పాటుచేశారు. గ్రామమంతా పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, ఎంపిడిఒ కిశోర్‌కుమార్, ఇఒపిఆర్‌డి శివాజీ, కార్యదర్శి శివరామకృష్ణ, ప్రతిమ, సీనియర్ సహాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రామభద్రపురం : క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ టీం-5లో శుక్రవారం కొట్టక్కి గ్రామంలో అధికారులు స్వయంగా చీపుర్లు చేతపట్టి రోడ్లను శుభ్రం చేశారు. అధికారులతోపాటు గ్రీన్ అంబాసిడర్లు కాలువల్లో పూడికలు తీసి, చెత్తకుప్పలు తొలగించారు. అనంతరం పారిశుధ్యంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల : పచ్చదనం, పరిశుభ్రతపై మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు ముగిశాయి. థీమ్ 5లో భాగంగా సీతారామునిపేటలో ఎంపిడిఒ కె.రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో గ్రీన్‌మిత్రలకు శిక్షణ ఇచ్చారు. 60 మందితో గ్రామాన్ని శుభ్రం చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శంకర్ జగన్నాథ్, పంచాయతీ కార్యదర్శి బంగారు రాజు, ఎంఒటి వెంకటేష్ పాల్గొన్నారు.

సాయిగౌతమ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గజపతినగరం

విజయనగరం ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-17 స్విమ్మింగ్ పోటీలలో గజపతినగరం సాయి గౌతమ్ స్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. బి.సాయికుమార్, ఎల్.సోహిల్ ఉత్తమ ప్రదర్శన కనబరిచి ఇటీవల విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొని ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ఎస్.ఎన్. నాయుడు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ నాయుడు

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : డిఎస్‌పి

ప్రజాశక్తి కొత్తవలస

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని డిఎస్‌పి గోవిందరావు విద్యార్థులకు, యువతకు పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన సైకిల్ యాత్ర శుక్రవారం కొత్తవలస చేరుకుంది. కొత్తవలసలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిఐ షణ్ముఖరావు పాల్గొన్నారు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మంచిమనసు చాటుకున్న కృష్ణ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామానికి చెందిన బుద్ధా కృష్ణ మంచిమనసు చాటుకున్నారు. మండలంలో జాకేరు గ్రామం మీదుగా బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాలకు శృంగవరపుకోట డిపో నుంచి బడిబస్సు వస్తోంది. రహదారి సరిగా లేకపోవడం, ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడటంతో ఈ బస్సు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో జాకేరుకు చెందిన నాయకులు బుద్ధా అప్పలనాయుడు కుమారుడు కృష్ణ స్పందించి, పాడైపోయిన రోడ్డును బాగుచేసేందుకు చర్యలు చేపట్టారు. సొంత నిధులతో మెటల్, క్రషర్‌బుగ్గితో గోతులు పూడ్చారు. తద్వారా బస్సు రాకపోకలకు ఆటంకాలు కడగకుండా, విద్యార్థులు పాఠశాలలకు సకాలంలో చేరుకునేలా రోడ్డును సిద్ధం చేశారు.

రీడింగ్ హాల్ కెపాసిటీ పెంచాలి : ఆప్

కంటోన్మెంట్ : గురజాడ జిల్లా స్మారక కేంద్ర గ్రంథాలయం మేడపై ఉండే రీడింగ్ హాల్ కెపాసిటీని మరింతగా పెంచాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సీర రమేష్.. శుక్రవారంకలెక్టర్ రామ సుందర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు.

నేడు ఉపాధి హామీ గ్రామసభ

వేపాడ : మండలంలోని గ్రామాల్లో శనివారం ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎపిఒ ఆదిలక్ష్మి తెలిపారు. ఈ గ్రామసభలకు ఉపాధి హామీ మేట్లు, వేతనాలు హాజరుకావాలని కోరారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-రామభద్రపురం

ఒంటరిగా బతలేక పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకుందని ఎఎస్ఐ అప్పారావు తెలిపారు. పాతరేగ గ్రామానికి చెందిన ఇల్లా అప్పయ్యమ్మ (70) ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లకు వివాహాలు చేసి చిన్న కుమారుడు దగ్గర ఉంటుంది. అక్కడ కూడా ఆమె వేరుగా ఉండి వంట చేసుకుంటోంది. అయితే ఒంటరిగా ఉండి మానసిక వేదనకు గురై గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే ఆమెను బాడంగి సిహెచ్‌సికి తరలించగా ప్రాథమిక చికిత్స చేసి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం ఆమె మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

బైక్‌ల చోరీ కేసులో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి-బొండపల్లి

బైక్‌ల దొంగతనం కేసులో విజయనగరానికి చెందిన పడాల జనార్దన్‌తోపాటు ముగ్గురు జువైనల్స్‌ను అరెస్ట్ చేసినట్లు డిఎస్‌పి భవ్య రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ బైక్‌లను ఏడుగురు సభ్యుల ముటా దొంగతనం పాల్పడుతున్నారని తెలిపారు. సిఐ ఎ.వి.రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ యు.మహేష్, సిబ్బంది బొండపల్లి సరిహద్దుల్లో జనార్దన్‌పాటు మరో ముగ్గురు జువైనల్స్‌ను అదుపులో తీసుకున్నట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సిఐ ఎ.వి.రమణ, ఎస్ఐ యు.మహేష్, పోలీసు సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి భవ్యరెడ్డి

పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. ఎటువంటి డయేరియా కేసులు నమోదు కాకముందే పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. శుక్రవారం కలెక్టర్ పారిశుధ్యం, ఉపాధి పనులపై టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రక్షిత తాగు నీటిని సరఫరా చేయాలని, నీటిని ఎప్పటికప్పుడు పరీక్షించాలని సూచించారు. ఒడిఎఫ్ ప్లస్ కింద పూర్తయిన గ్రామాలలో రీ వెరిఫికేషన్ త్వర పూర్తి చేసి పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. ఉపాధి హామీ లో మస్టర్, పని దినాల కల్పనలో వెనుకబడిన మండలాలు కలెక్టర్ సమీక్షించారు. నెలాఖరు వరకు పురోగతి సాధించని పక్షంలో తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరాసరి వేతన చెల్లింపులు విషయమై ఈ నెలలో తక్కువగా ఉన్న రాజాం, వంగర, మరియు విజయనగరం మండలాల సిబ్బందిని హెచ్చరించారు. నవంబర్ 22 న జరగబోయే ప్రత్యేక గ్రామ సభలలో తీసుకోవాల్సిన చర్యల గురించి కలెక్టర్ అధికారులకు తెలియజేశారు.

అనాథ బాలలకు భవిష్యత్తు నిర్మిద్దాం

మిషన్ వాత్సల్య కమిటీ సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అనాథ బాలల సంరక్షణ కోసం గ్రామస్థాయి కమిటీలు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అనాథ బాలల సంక్షేమం పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వ మిషన్ వాత్సల్య కార్యక్రమం కింద జిల్లా కమిటీ సమావేశం కలెక్టరేట్ లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉన్న పాఠశాల్లలో ఇప్పటివరకు 350 మంది విద్యార్థులు బడి మానేశారని, వారి వివరాలు సేకరించి తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖాధికారికి ఆదేశించారు. వసతి గృహాల్లో సరైన పౌష్టికాహారం అందించాలని లేనియెడల సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకు శిశు గృహం నుండి 56 మంది చిన్నారులను దత్తత ఇచ్చినట్లు వివరించారు. ప్రస్తుతం శిశుగహం లో ఐదుగురు చిన్నారులు ఉన్నారని తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కష్ణప్రసాద్ వారి సమక్షం లో మిషన్ వాత్సల్య పథకం లో తల్లిదండ్రులను కోల్పోయిన ఎనిమిది మంది పిల్లలతో ముఖా ముఖి నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ విమలా రాణి, డిఇఒ మాణిక్యం నాయుడు, ఎడిఎంఎచ్ఒ కె.రాణి, డిసిహెచ్ఎస్ పద్మశ్రీ రాణి, డిసిఎల్ ప్రసాదరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



అనాథ బాలలతో కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ధాన్యం కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి-గుర్ల

మండలంలోని గూడెం, కెల్ల పిఎసిఎస్‌ల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామ్ మల్లిక్ నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి వెన్నె సన్యాసినాయుడు, మండల అధ్యక్షులు చనమల మహేశ్వరరావు, పిఎసిఎస్ చైర్మన్లు పిల్లా అప్పలనాయుడు, కె.విమలరాణి, డైరెక్టర్లు కె.కృష్ణ, ధవళ రమణ, టిడిపి నాయకులు డాక్టర్ సుంకరి రమణ మూర్తి, ఎఎంసి వైస్ చైర్మన్ దాసరి శివ ప్రసాద్ పాల్గొన్నారు.

రామభద్రపురం : రామభద్రపురం పిఎసిఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ అజురఫీ జాన్, చైర్మన్ చొక్కాపు విజయలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఒ అమరా శివ, టిడిపి మండల అధ్యక్షులు కరణం విజయభాస్కరరావు, జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు, డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు చొక్కాపు రామారావు పాల్గొన్నారు.



దత్తిరాజేరు.. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పిఎసిఎస్ చైర్మన్ అలివేణి

దత్తిరాజేరు : దత్తిరాజేరు రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పిఎసిఎస్ వంగపండు అలివేణి, టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ హరికిరణ్, ఎఒ అనురాధ, సిఎస్ డిటి సత్యనారాయణ, పిఎసిఎస్ సిఇఒ బలరాం, టిడిపి నాయకులు బి.సత్తిబాబు, మిత్తిరెడ్డి ఈశ్వరరావు, బండి కృష్ణ, గౌరినాయుడు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణపై శిక్షణ

ప్రజాశక్తి-పూసపాటిరేగ

పూసపాటిరేగ పిహెచ్‌సిలో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బాలల హక్కుల పరిరక్షణపై శిక్షణ ఇచ్చారు. వైద్యాధికారి ఎస్.ప్రమీల దేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ ఐ.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బాలల రక్షణకు సంబంధించిన పోక్సో చట్టం, విధి విధానాలపై అవగాహన కల్పించారు. సైకాలజిస్ట్ ఎస్.రమణ, కౌన్సిలర్ ఎం.లావణ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలు వివరించారు. విద్యాశాఖ అధికారులు పాపినాయుడు, రాజ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ బి.హనుమంతరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీలు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ దుర్గాప్రసాద్

ఉపకరణాలతో పని సులభం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉపకరణాలతో పని సులభంగా, వేగంగా చేయవచ్చని రోటరీ జిల్లా చైర్మన్ జెసి రాజు అన్నారు. శుక్రవారం స్థానిక పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో శిక్షణ తీసుకుంటున్న 40 మంది విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను రోటరీ క్లబ్ కార్యదర్శి, ఐటిఐ సహాయక శిక్షణ అధికారి రూ.10 వేలు సొంత నిధులు వెచ్చించి సమకూర్చగా, వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు శ్రీహరి, శ్రీనివాసన్, సిబ్బంది రాములపప్పడు, హరికృష్ణ, యుగంధర్ పాల్గొన్నారు.